సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం

సిరిసిల్లకల్చరల్: గాంధీనగర్‌లోని శ్రీభక్తాంజనేయ రుక్మిణీ విఠలేశ్వరస్వామి కల్యాణం, మహాయజ్ఞం ఆదివారం కనులపండువగా నిర్వహించారు.



వైభవంగా సీతారాముల కల్యాణం

ఇల్లంతకుంట(మానకొండూర్): రేపాకలోని సీతారామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పొద్దంత ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సమాజాన్ని చైతన్యం చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: సమాజాన్ని చైతన్యం చేసే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. పదేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ కె.పున్నంచందర్, హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు అలువాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ దాసరి తిరుమల, మాజీ కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్, చిలుక రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఫుడ్‌పాయిజన్ ఘటనలు

- బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ ఘటనలు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా దామరవంచ గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్ జరిగి 16 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడాదిలో ఎందరో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విద్యార్థులకు పెడితే అరెస్టులు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినా పరిస్థితుల్లో మార్పులు రావడం లేదన్నారు. కోడం వెంకటేశ్, గాజుల మహేశ్, శ్రీకాంత్, తిరుపతి, ఉమేశ్, లక్ష్మణ్‌రాజు, ఉపేంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

ఇక సౌర వెలుగులు

- 4 కేంద్రాల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి
- సబ్‌స్టేషన్లకు అనుసంధానం
- రోజూ 3.30 లక్షల యూనిట్ల కరెంట్ తయారీ
- ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌తో ఒప్పందాలు
- పొరుగు జిల్లాలకూ సరఫరా



సిరిసిల్ల: జిల్లాలో సౌరవిద్యుత్ వెలుగులు విస్తరిస్తున్నాయి. ఎండలు ముదురుతున్న తరుణంలో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాత్రి వేళల్లో చలి ఉంటున్నా పగటిపూట ఎండలు బాగా కొడుతున్నాయి. దీంతో సౌర విద్యుత్ ఉత్పత్తి పెరుగుతోంది. జిల్లాలోని వినియోగదారుల అవసరాలను సౌరవిద్యుత్ తీర్చుతోంది. సహజ సిద్ధమైన సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు జిల్లాలో నాలుగు ఉన్నాయి. వస్త్రోత్పత్తి పరిశ్రమలపైన, జిల్లా ఆస్పత్రిలోనూ సోలార్ విద్యుత్ పలకలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో నిత్యం ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను నేరుగా సబ్‌స్టేషన్లకు అనుసంధానం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు ప్రైవేటు సౌరశక్తి ఆధారిత విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌తో ఒప్పందం చేసుకుని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి.

ఎండలు ఉంటేనే కరెంట్

జిల్లాలో మూడు ప్లాంట్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఎండలు బాగా ఉంటేనే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. మేఘావృతమై ఉంటే ఉత్పత్తి నిలిచిపోతుంది. మబ్బులు పట్టినా, వర్షాలు పడినా కరెంట్ ఉత్పత్తి కాదు. ఇప్పుడు ఎండలు మండుతుండడంతో రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి సాగుతోంది. ఒక్కో మెగావాట్ విలువ 6000 యూనిట్లు అంటే జిల్లాలో ప్రస్తుతం 55 మెగావాట్లు ఉత్పత్తి అవుతుంది. అంటే 3.30 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి రోజూ జరుగుతోంది. ఒక్కో యూనిట్‌ను రూ.6.50 నుంచి రూ.7 వరకు సీజన్‌ను బట్టి ఎన్పీడీసీఎల్ కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తుంది. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఖరీదు ఎక్కువ కావడంతో సౌరశక్తి ఆధారిత విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు.

జిల్లాలో ప్లాంటు.. పొరుగు జిల్లాకు కరెంట్

ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో 200 ఎకరాల్లో సౌరశక్తి ఆధారిత విద్యుత్ ప్లాంటు ఏర్పాటైంది. ఓ ప్రైవేటు కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేసింది. ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని ఎస్పీడీసీఎల్‌కు అందిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఉండగా.. మూడు రాజన్నసిరిసిల్ల జిల్లా వినియోగదారులకు అందిస్తున్నాయి. నామాపూర్ ప్లాంటు సిద్దిపేట జిల్లా పరిధిలోని సబ్‌స్టేషన్లకు సరఫరా చేస్తుంది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేట వద్ద రేకులకుంట సమీపంలోనూ మరో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఉంది. వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. సౌరశక్తి విద్యుత్‌ను గ్రిడ్‌తో అనుసంధానం ఉండడంతో అవసరాన్ని బట్టి వినియోగించుకునే వీలుంటుంది. విద్యుత్‌ను పూర్తి స్థాయిలో నిల్వ చేసే అవకాశాలు లేవు. గ్రిడ్‌కు అనుసంధానించడంతో విద్యుత్ ఉత్పత్తిని, వినియోగాన్ని గ్రిడ్ నియంత్రిస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి పైకప్పుపై, టెక్స్‌టైల్‌పార్క్‌లోని యూనిట్లపై, సిరిసిల్ల పట్టణంలోని కొన్ని ఇళ్లపైన సోలార్ పలకలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను ప్రత్యేక మీటర్ల ద్వారా రీడింగ్ తీస్తూ.. ఎన్పీడీసీఎల్‌కు అనుసంధానించారు. ఇలా జిల్లాలో సౌరశక్తి ఆధారిత విద్యుత్ కేంద్రాలు వెలుగులను పంచుతున్నాయి.

నిత్యం 55 మెగావాట్ల ఉత్పత్తి

ఇల్లంతకుంట మండలం రామాజీపేటలో 150 ఎకరాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటును ఏర్పాటు చేశారు. నిత్యం 30 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నేరుగా సిరిసిల్ల శివారులోని పెద్దూరు 132 కేవీ సబ్‌స్టేషన్‌కు అందిస్తున్నారు. పెద్దలింగాపూర్‌లోనూ 120 ఎకరాల్లో సౌరశక్తి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం 10 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి సాగుతోంది. దీనిని పెద్దలింగాపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు. వేములవాడ మండలం నూకలమర్రిలోనూ 100 ఎకరాల్లో సౌరశక్తి ఆధారిత విద్యుత్ ప్లాంటు ఉంది. ఇక్కడ నిత్యం 15 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీనిని మల్లారంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ అందుబాటులోకి వచ్చింది.

ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- పోతుగల్‌లో పీహెచ్‌సీ భవనం ప్రారంభం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. వైద్యసిబ్బంది, అధికారులు ప్రజలపై సానుభూతితో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సత్వర వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెరిగేలా చూడాలన్నారు. ఆస్పత్రి నిర్మాణంలో వచ్చిన నాణ్యత లోపంపై క్వాలిటీ కంట్రోల్‌కు సమర్పించినట్లు తెలిపారు.

పరుగులు పెట్టించిన కలెక్టర్

ఆస్పత్రి నూతన భవనం ప్రారంభోత్సవం అనంతరం కలెక్టర్ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న పోతుగల్ గోదామును తనిఖీ చేశారు. ఆదివారం కావడంతో ఎవరూ లేకపోవడంతో అరగంటపాటు అక్కడే వేచి ఉన్నారు. సిబ్బంది గోదాము తాళాలు తీయగానే స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. యూరియా సంచులను కలెక్టర్ స్వయంగా లెక్కించి, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, సీఎస్‌ఆర్ గ్రాంటు ఇవ్వాలని ఆదేశించారు. పురుగులు పట్ట పుట్నాలు, కందిపప్పులను మార్చాలని, విద్యార్థులకు చల్లనీ నీరు అందించాలన్నారు. జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో బీరయ్య, పోతుగల్ వైద్యాధికారి గీతాంజలి, డీఈ సుదర్శన్‌రెడ్డి, శంకర్, ధర్మేందర్, కృష్ణ, నాని, సీఈవో కృష్ణ పాల్గొన్నారు.

బీసీల జనాభా తగ్గడం కుట్రనే..

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



మాట్లాడుతున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్లటౌన్: కులగణనలో బీసీల జనాభా తగ్గడం కుట్ర పూరితమేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీసీ సంఘం కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఏడాది పొడవునా ఊరించి తీరా సమయానికి తుస్సు మనిపించిన సర్కారు తీరు శోచనీయమన్నారు. బీసీ జనాభా పెరగాల్సింది పోయి ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత చేయాలని, కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు వీరబోయిన మల్లేశ్, సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా నాయకులు తోట రాములు, బచ్చు ప్రసాద్, ఇల్లంతకుంట తిరుపతి, దుబాల కొండయ్య, సామల తిరుపతి, కత్రోజే శంకర్, కస్ప రవీందర్, చిందం శ్రీధర్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

- మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్



ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

సిరిసిల్ల: కరాటేతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని సిరిసిల్ల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక బీవై నగర్ షాదీఖానాలో ఆదివారం సామ్రాయి గోజుర్యై కరాటే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఓపెన్‌టు ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్గనైజర్ ఎండీ సమీన, స్థానిక మాజీ కౌన్సిలర్ రెడ్డినాయక్, సాయభూషణ్, రమేశ్, కరాటే మాస్టర్లు నేరెళ్ల శ్రీధర్‌గౌడ్, మామిడాల సమ్మయ్య, ఓరుగంటి రామకృష్ణ, కరీంనగర్ ఉష సెక్రటరీ విద్యాసాగర్, కనకయ్య, విక్రమ్, బాలరాజు, ఎనగందుల శ్రీనివాస్, మాడ సంపత్ పాల్గొన్నారు.

పాదయాత్రగా రాజన్న చెంతకు..



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని శ్రీగీతామందిరం 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ఆదివారం ఆలయం నుంచి వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయానికి 40 కిలోమీటర్ల దూరం పాదయాత్రగా వెళ్లారు. రాచర్లగొల్లపల్లి నుంచి భక్తులు భజనలు చేస్తూ వెళ్లారు. ఇటీవల ఆలయంలో శ్రీరాధాకృష్ణుల కల్యాణోత్సవం నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ రఘురామశర్మ పాల్గొన్నారు.

సేవాలాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



మాట్లాడుతున్న రాములునాయక్

సిరిసిల్లటౌన్: సద్గురు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకొని సిరిసిల్లలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం చిన్నబోనాలలో గోర్ బంజారా నాయకులు క్రికెట్ పోటీలు ప్రారంభించారు. రాష్ట్ర గోర్ సిక్వాడి సంయోజక్ రాములునాయక్ మాట్లాడారు. గోర్ యువకులు క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ భూక్య గజన్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, గుగులోత్ సురేష్‌నాయక్, మేనేజ్‌మెంట్ నిర్వాహకులు రవినాయక్, మోతిలాల్ నాయక్, రాజునాయక్, గోపీనాయక్, దేవ్‌సింగ్ నాయక్, రాందాస్‌నాయక్, సేవ్యానాయక్, నరేశ్ నాయక్, భాస్కర్‌నాయక్, హజునాయక్, ప్రదీప్, మహేందర్, సాగర్, అఖిల్, మధు, చిన్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు.. పొలంగట్లే అడ్డాలు

- అటవీప్రాంతంలో జోరుగా మూడు ముక్కలాట
- కాపలాదారుల పర్యవేక్షణలో గేమ్స్
- ఆటకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు బెట్టింగ్‌లు
- రోజు రూ.5లక్షలకు పైగానే చేతులు మారుతున్న వైనం
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న కుటుంబాలు

చందుర్తిలోని ఓ వ్యాపారి పేకాటకు బానిసయ్యాడు. దుకాణాన్ని వదిలి పెట్టి రోజు పేకాటకు వెళ్లేవాడు. దాదాపు రూ.1.20కోట్ల వరకు అప్పులు అయ్యాడు. చివరికి వేములవాడ బైపాస్‌రోడ్డులో ఉన్న ఇంటిని రూ.70లక్షలకు విక్రయించి, చందుర్తిలోని ఇళ్లను అమ్మినా బాకీలు తీరలేదు. అప్పులు ఇచ్చిన వారి వేధింపులు పెరిగిపోవడంతో కుటుంబాన్ని, గ్రామాన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు.

చందుర్తి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు పేకాట ఆడుతూ డబ్బులు నష్టపోయాడు. ఊరిలో పనిలేక తనకున్న 10 ఎకరాల భూమి, ఇంటిని వదిలేసి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. అక్కడే డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కాలం వెల్లదీస్తున్నాడు.

చందుర్తి(వేములవాడ): పోలీసుల తనిఖీలు పెరగడం.. గ్రామాల్లో అనుకూల వాతావరణం లేకపోవడంతో పేకాటరాయుళ్లు అటవీబాట పట్టారు. అటవీప్రాంతంలో అడ్డాలు ఏర్పాటు చేసుకొని ఎంచక్కా తీన్‌పత్తా ఆడుతున్నారు. పేకాట జిల్లాలోని అనేక కుటుంబాలను దెబ్బతీసింది. చాలా మంది అప్పులపాలై ఉన్న ఆస్తులు అమ్ముకొని ఇతర ప్రాంతాలకు వలసపోయారు. అయినా మానడం లేదు.

పొలంగట్లు.. ఒర్రెలు

చందుర్తి మండల పరిధిలోని రామన్నపేట, తిమ్మాపూర్ గ్రామాల శివారు, చందుర్తి, కోనరావుపేట మండలాల సరిహద్దు మామిడిపల్లి, బావుసాయిపేట, రుద్రంగి, వేములవాడరూరల్ మండలాల పరిధిలోని పొలంగట్లు, గుట్టప్రాంతాలు, ఒర్రెల్లో పేకాటరాయుళ్లు రోజంతా తీన్‌పత్తా ఆడుతున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకే అటవీప్రాంతాలను ఎంచుకున్నట్లు తెలిసింది.



బండపల్లి శివారులోని పేకాట స్థావరం



పేకాటరాయుళ్లు తిని పారేసిన ప్లేట్లు

అటవీప్రాంతం సేఫ్ జోన్

- జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం మోతుకురావుపేట–చందుర్తి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంతోపాటు రామన్నపేట అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న పొలాలు.
- చందుర్తి, కోనరావుపేట మండలాల సరిహద్దు గ్రామాలు బండపల్లి, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల మధ్య పొలాలు.
- వేములవాడరూరల్ మండలం హన్మాజిపేట, చందుర్తి మండలం ఎన్గల్, మర్రిగడ్డ గ్రామాల మధ్య కూడళ్లలోని ఒర్రె పొంతం.
- కోనరావుపేట మండలం మామిడిపల్లి, వేములవాడరూరల్ మండలం నూకలమర్రి, చందుర్తి మండలం ఎన్గల్ మధ్య గల నక్కఒర్రె, రుద్రంగి, చందుర్తి మండలాల సరిహద్దు గ్రామాలు లింగంపేట, సనుగుల, రుద్రంగి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో పేకాటను ఆడుతున్నారు.

ఆర్థికంగా కుదేలు

పేకాట ఆడి అనేక కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయాయి. ఒక్కో గేమ్‌కు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం. నిత్యం తక్కువకు తక్కువగా రూ.5లక్షల వరకు చేతులు మారుతున్నట్లు తెలిసింది. చందుర్తి మండలానికి చెందిన ఓ యువకుడు తీన్‌పత్తా ఆటలో రూ.1.50లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. మరో యువకుడు రూ.2లక్షలు సంపాదించాడని పేకాటరాయుళ్లే చర్చించుకుంటున్నారు. ఇంకొకరు రూ.4లక్షలకు పైగా పోగొట్టుకొని అప్పులు తీర్చేందుకు గల్ఫ్‌బాట పట్టాడు.

కాపలా మధ్య అడ్డాలు

పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేయకుండా ముందస్తుగా సమాచారాన్ని తెలుసుకునేందుకు నలుదిక్కులా కాపలాదారులు(సెంట్రీలు) పెట్టుకుంటున్నారు. నిత్యం నలుగురిని కాపలా పెట్టుకోవడంతోపాటు వారికి రోజుకు రూ.వెయ్యి చొప్పున కూలి ఇస్తున్నట్లు తెలిసింది. షిఫ్టు పద్ధతిలో ఆడే ఈ ఆటకు ప్యూరిఫైడ్ వాటర్, బిర్యానీ, చికెన్, ఇతరత్ర ఫుడ్ సప్లయ్ చేసేందుకు ఇద్దరిని, గ్రామంలో సమాచారం సేకరించేందుకు మరో ఇద్దరిని ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఇలా దాదాపు 8 మందికి నిత్యం రూ.10వేల వరకు చెల్లిస్తుండడం విశేషం. ఈ ఎనిమిది మంది ఎలాంటి పోలీస్ మూమెంట్ ఉన్న వెంటనే పేకాటరాయుళ్లకు సెల్‌ఫోన్ల ద్వారా చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. ఇలా పోలీసులకు చిక్కకుండా యథేచ్ఛగా పేకాట ఆడుతున్నారు.

నిఘా పెట్టాం



చందుర్తి మండలంలోని అటవీ ప్రాంతంలోని ఒర్రెలు, గుట్టప్రాంతాల్లో పేకాట ఆడుతున్నట్లు మా దృష్టికొచ్చింది. పేకాట స్థావరాలపై నిఘా పెట్టాం. సర్కిల్ పరిధిలో ఎక్కడెక్కడా ఆడుతున్నారన్న వివరాలు సేకరించాం. సాధ్యమైనంత తొందరలోనే వారిని పట్టుకుంటాం. పేకాట ఆడే వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– గాండ్ల వెంకటేశ్వర్లు, సీఐ, చందుర్తి

క్లుప్తంగా

క్వారీ పని ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

• మృతుడు మధ్యప్రదేశ్‌వాసి

గంగాధర(చొప్పదండి): క్వారీలో పని చేయడం ఇష్టం లేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ పటేల్(25) కొన్ని రోజులుగా గంగాధర మండలం ఒద్యారంలోని గ్రానైట్ క్వారీలో పని చేస్తున్నాడు. తనకు క్వారీలో పని చేయడం ఇష్టం లేదని, ఇంటికి వస్తానంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. వారు రావొద్దని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం క్వారీ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు కన్యాలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెన్కెపల్లిలో వృద్ధుడు..

సైదాపూర్: వెన్కెపల్లికి చెందిన అమరగొండ వీరయ్య(75) ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వీరయ్య కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి ఇంటి సమీపంలోని మంచినీటి బావిలో దూకాడు. ఆదివారం అతను ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకగా బావిలో మృతదేహం కనిపించింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కుమారుడు మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

ధర్మారం(ధర్మపురి): ఆత్మహత్యాయత్నం చేసిన ధర్మారం మండలంలోని కానంపెల్లి గ్రామానికి చెందిన గడ్డం అజయ్(22) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అజయ్ ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లికి ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై, గత నెల 29న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని కౌలు రైతుకు తీవ్ర గాయాలు

పెగడపల్లి(ధర్మపురి): కారు ఢీకొన్న ఘటనలో ఓ కౌలు రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లికి చెందిన కొత్తపల్లి నరసింహాచారి పెగడపల్లిలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. భూమిని కౌలుకు తీసుకొని, వ్యవసాయం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకొని, రోడ్డుపైకి వచ్చాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో నరసింహాచారి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హనుమాన్ ఆలయంలో చోరీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లి హనుమాన్ ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి, హనుమంతుని విగ్రహానికి ఉన్న వెండి కళ్లు, హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

కరీంనగర్ టు దుబాయ్.. వయా జగిత్యాల

• జీబీఆర్ క్రిప్టో కేసులో భారీ హవాలా కోణం
• 'లక్కీ భాస్కర్' రమేశ్‌గౌడ్‌కు హవాలా వ్యాపారులతో లింకులు
• దాదాపు రూ.40 కోట్ల వరకు దుబాయ్‌కి పంపినట్లు అనుమానం
• కస్టమర్ల నుంచి బీఎస్‌బీ, యూఎస్‌డీటీ ద్వారా సేకరణ
• రమేశ్ వసూలు చేసిన డబ్బు వివరాలు రాబట్టేదెలా?
• త్వరలో సీఐడీ కార్యాలయం ఎదుట ధర్నా ఆలోచనలో బాధితులు


రమేశ్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: క్రిప్టో కరెన్సీ పేరిట అమాయకుల నుంచి రూ.కోట్లు వసూలు చేసి 'లక్కీ భాస్కర్' సినిమా తరహాలో దేశం దాటిపోదామనుకున్న రమేశ్‌గౌడ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో నిందితుడు వసూలు చేసిన మొత్తంలో దాదాపు రూ.40 కోట్ల వరకు హవాలా ద్వారా దుబాయ్‌కి పంపినట్లు తెలిసింది. ఇందుకోసం అతను పలువురు హవాలా వ్యాపారులను ఆశ్రయించినట్లు సమాచారం. మొత్తం వసూలు చేసిన డబ్బును జగిత్యాల, వరంగల్ జిల్లాలోని హవాలా వ్యాపారుల సాయంతో హైదరాబాద్ మీదుగా దుబాయ్‌కి పంపారని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంలో జీబీఆర్ రమేశ్‌గౌడ్ తాను ఎక్కడా దొరకకూడదన్న ఉద్దేశంతో చాలా తెలివిగా వ్యవహరించాడు. డబ్బుకు ఆశపడి అతడి మాటలు నమ్మిన బాధితులు వెంటనే తేరుకున్నారు. అతని ప్రతీ కదలిక, ప్రతీ లావాదేవీలను ఎప్పటికపుడు కనిపెట్టి సీఐడీకి అప్పగించారు. ఇందులో భాగంగానే ఇటీవల కరీంనగర్ సీఐడీ డీఎస్పీ పలుమార్లు రమేశ్‌గౌడ్‌తో రహస్య సమావేశాల వివరాలు కూడా ఉన్నతాధికారులకు అందించారు. దీంతో అతనిపై వేటు పడిన విషయం తెలిసిందే. మరోవైపు ఇంతకాలమైనా కేసు దర్యాప్తులో పురోగతి లేదంటూ బాధితులు త్వరలో కరీంనగర్ సీఐడీ కార్యాలయం ఎదుట ధర్నా చేసే ఆలోచనలో ఉన్నారు.

ఆధునిక విధానంలో వసూలు

క్రిప్టో కరెన్సీ ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉన్న పెట్టుబడి కావడంతో సహజంగానే బాధితులు అతని మాటలు నమ్మారు. పైగా రామోజీ ఫిలింసిటీ, గోవా, సింగపూర్, మలేసియా, దుబాయ్ దేశాల్లో ఖరీదైన ఈవెంట్లు పెట్టడంతో కస్టమర్లు అతని జీబీఆర్ క్రిప్టోలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారు. ఇక్కడే రమేశ్‌గౌడ్ చాలా ఆధునికంగా ఆలోచించాడు. కస్టమర్ల నుంచి తొలుత దాదాపు రూ.30కోట్లకుపైగా డబ్బును కస్టమర్లు నగదు రూపంలో చెల్లించారని తెలిసింది. కస్టమర్లు మరీ అధికంగా డబ్బులు కడుతుండటంతో ఐటీకి చిక్కుతామని తెలివిగా వ్యవహరించాడు. అప్పటి నుంచి కస్టమర్ల నుంచి పెట్టుబడులను క్రిప్టో కాయిన్స్ విదేశాల్లో అయిన బీఎస్‌బీ, యూఎస్‌డీటీ, క్రిప్టో వ్యాలెట్లు అయిన ట్రస్ట్ వ్యాలెట్, బినాన్స్, వజ్రిక్స్ తదితర వాలెట్ల ద్వారా సేకరించాడు.

రూ.10 నోటు ద్వారానే అధికం

వ్యక్తులకు అడిగినంత డబ్బును అందజేయడానికి హవాలా వ్యాపారులు ఉంటారు. ఉదా: రూ.కోటిని దుబాయ్‌కి పంపాలనుకుంటే.. అక్కడ తమ కమీషన్ మినహాయించుకుని మిగిలిన డబ్బును వారు చెప్పిన వ్యక్తికి అందిస్తారు. అది ఇవ్వాలంటే రూ.10 నోటును చింపి ఇస్తారు. విదేశాలకు వెళ్లి చినిగిన ముక్కను ఇస్తే.. మిగిలిన డబ్బు అందిస్తారు. ఇదే తరహాలో రమేశ్‌గౌడ్ తనకు రావాల్సిన డబ్బును హవాలా మార్గంలో సేకరించాడు. తాను చెప్పిన హవాలా వ్యాపారి వద్ద డబ్బులు కట్టించాడు. ఆ డబ్బును తాను ఇండియాలో కాకుండా తెలివిగా దుబాయ్‌లో డ్రా చేసుకున్నాడు. అలా హవాలా, క్రిప్టో వ్యాలెట్ల ద్వారా డబ్బును దుబాయ్‌లో డాలర్ల రూపంలోకి మార్చుకున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.40 కోట్ల డాలర్ల వరకు డ్రా చేసుకుని అలా అక్కడ ఆస్తులు కొనుగోలు చేశాడు. అలా అక్కడ పదేళ్ల వరకు నివసించేలా వీసా సంపాదించడాన్ని సీఐడీ అధికారులు కూడా గుర్తించిన విషయం తెలిసిందే. దేశం దాటిపోయిన బాధితుల డబ్బును తిరిగి తీసుకురావడం సీఐడీకి సవాలుగా మారింది. మనీలాండరింగ్ జరిగిన నేపథ్యంలో కేసు సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తూ తండ్రి.. దొంగతనం కేసులో కొడుకు

• ఒకేరోజు ఇద్దరి అరెస్టు
• జైలులో చిన్న కుమారుడు

సుల్తానాబాద్‌రూరల్: తండ్రి, ఇద్దరు కుమారులు.. ఒకరి వెంట ఒకరు నేరబాట పట్టారు. గంజాయి విక్రయిస్తూ తండ్రి.. చోరీ కేసులో పెద్ద కొడుకు.. ఒకే రోజు ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. అంతకు ముందే దొంగతనం కేసులో చిన్న కుమారుడు జైలుకెళ్లాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్(పూసాల)కు చెందిన వేముల శ్రీనివాస్‌కు ఇద్దరు కమారులున్నారు. అతను ఓ టిఫిన్ సెంటర్‌లో మాస్టర్‌గా పని చేస్తున్నాడు. శ్రీనివాస్ చిన్న కొడుకు చంద్రప్రకాశ్ మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి గంజాయి తీసుకువచ్చాడు. దాన్ని స్థానికంగా విక్రయించేందుకు ఇంట్లో ఉంచాడు. ఈలోగా కరీంనగర్‌లో జరిగిన చోరీ కేసులో నేరస్తుడిగా తేలి, జైలుకెళ్లాడు. దీంతో ఇంట్లో ఉన్న గంజాయిని తండ్రి జులాయిగా తిరుగుతున్న వారికి, పరిశ్రమల్లో పని చేసేవారికి చిన్న చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తున్నాడు. ఆదివారం పోలీసులు శాస్త్రీనగర్ స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాస్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని, విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. 34 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, అతన్ని అరెస్టు చేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులో ఈ నెల 8న రాత్రి చోరీ జరిగింది. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తుండగా శ్రీనివాస్ పెద్ద కుమారుడు భవానిప్రకాశ్ పుసాల రోడ్డు వద్ద ఆదివారం అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని, విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. మెడికల్ షాపులో నుంచి రూ.24 వేలు, ఒక స్మార్ట్‌ఫోన్ ఎత్తుకెళ్లి, రూ.6 వేలు ఖర్చు చేశాడని ఎస్సై తెలిపారు. మిగతా రూ.18 వేలతోపాటు ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, భవానిప్రకాశ్‌ను అరెస్టు చేశామన్నారు. తండ్రీకుమారుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కారులో తిరుగుతూ.. బైక్‌లు చోరీ


నిందితులు, కారు, బైక్‌లను చూపుతున్న డీఎస్పీ రఘుచందర్, సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్

• ఐదుగురి అరెస్టు
• 5 బైక్‌లు, ఒక కారు స్వాధీనం
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం: కారులో తిరుగుతూ.. ఇళ్ల ఎదుట పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేశారు.. ఇలా ఇప్పటి వరకు 5 వాహనాలను ఎత్తుకెళ్లిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన జక్కుల గోపాల్, సింగం రాజు, నేరెళ్ల నరేశ్, సంపతి కుమారస్వామి, ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని గ్రామానికి చెందిన బుర్ర రాజేందర్ ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి వేళల్లో కారులో వివిధ గ్రామాలు తిరుగుతూ ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్నారు. వాటిని సొంత పనులకు వినియోగిస్తున్నారు. ఇలా ఏడాదిగా.. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిప్పన్నపేట, సారంగాపూర్ మండలం పెంబట్ల, దండెపల్లి మండలం వెలుగనూర్, చిన్న బెల్లాల గ్రామాల్లో 5 బైక్‌లను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. ఆదివారం ఉదయం తిప్పన్నపేట శివారులో కారులో వస్తున్న వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బైక్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. 5 ద్విచక్రవాహనాలు, ఒక కారు, 5 ఫోన్లు స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం

వెల్గటూర్(ధర్మపురి): తల్లిదండ్రులకు భారం కావొద్దని భావించిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎండపల్లి మండలంలోని కొండాపూర్‌కు చెందిన సందవేని గంగజమున–శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మొదటి ఇద్దరికి పెళ్లిళ్లు చేశారు. మూడో కూతురు శ్రీవాణి (23) ధర్మారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతోంది. ఇద్దరు అక్కల పెళ్లిళ్లు చేయడానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడ్డారని నిత్యం ఆవేదన చెందుతుండేది. ఈ క్రమంలో చదువు బుర్రకు ఎక్కడం లేదని, తనకు ఎలాంటి ఉద్యోగం రాదనుకుంది. తల్లిదండ్రులకు భారం కావొద్దని నిర్ణయించుకొని, ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

• మృతుడు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పొలం పనులు చేసే వ్యక్తి

జగిత్యాల: బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం డబ్బుతిమ్మయ్యపల్లికి చెందిన వంగల సంపత్(45) ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి చెందిన పొలం పనులు చేస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు బావి లోతు ఎక్కువగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని, ఫైర్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 3 గంటలపాటు బావిలోని నీటిని తీసివేయడంతో సంపత్ మృతదేహం కనిపించింది. బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. తన పొలం పనులు చేసే వ్యక్తి మృతిచెందడంతో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు.

వృద్ధుడి దుర్మరణం

రామడుగు(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రామడుగు మండలంలోని వెదిర గ్రామానికి చెందిన కొల్లపూరి మైసయ్య(70) ఆదివారం రాత్రి స్థానిక బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో జగిత్యాల వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న బైక్ వేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మైసయ్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాలలో షార్ట్‌సర్క్యూట్

• కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్ దగ్ధం


దగ్ధమైన ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. సెలవు దినం కావడం.. విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంటలు రావడం గమనించిన వాచ్‌మెన్ కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చాడు. వారు సిరిసిల్ల అగ్నిమాపక శాఖ నంబర్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఐదు డెస్కులు, 20 కుర్చీలు, 2 కంప్యూటర్లు, ఒక ప్రొజెక్టర్ స్క్రీన్, ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోయాయని, రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రిన్సిపాల్ నాగేంద్రరావు తెలిపారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సైతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పరిశీలించారు.

మంథనిలో గర్భిణి ఆందోళన

• భర్త, మామ వేధిస్తున్నారని ఆవేదన

మంథని: భర్త, మామ వేధింపులు భరించలేకపోతున్నానంటూ.. ఓ గర్భిణి తన కుమారుడితో కలిసి రోడ్డుపై ఆందోళనకు దిగింది. న్యాయం చేయాలని వేడుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా యువతితో మంథని పోచమ్మవాడకు చెందిన రావుల మారుతి ప్రసాద్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. ఆమె ప్రస్తుతం 7 నెలల గర్భిణి. నిత్యం మద్యం సేవించి, అదనపు వరకట్నం కోసం భర్త, లైంగికంగా మామ వేధిస్తున్నారు. ఇద్దరూ కలిసి గత నెల 12న ఆమెను ఇంటి నుంచి గెంటివేశారు. దీంతో బాధితురాలు పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం తన తల్లి, కుమారుడితో కలిసి మంథనికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో బైఠాయించింది. తన భర్తకు ఇప్పటికే నాలుగు వివాహాలు జరిగాయని తెలిసిందని, మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని ఫొటో చూపిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆమెను ఠాణాకు తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను వివరణ కోరగా.. బాధితురాలు ఇదివరకే తమకు ఫిర్యాదు చేసిందన్నారు. తర్వాత పుట్టింటికి వెళ్తానని చెప్పడంతో ఖర్చులకు రూ.500 ఇచ్చి, పంపించామని తెలిపారు. గత నెల 12 తర్వాత ఆమె మళ్లీ రాలేదని, గర్భిణి కావడంతో తాము పిలవలేదని చెప్పారు. ఆదివారం ఇక్కడికి వచ్చి, అత్తింటివారితో గొడవ పడిందన్నారు. అనంతరం రోడ్డుపై బైఠాయించిందని పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదుపై విచారణ జరిపి, న్యాయం చేస్తామన్నారు.

ఆనందమేళా.. అదిరేలా





• పీటీఎస్ మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో ప్రారంభం
• దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో నిర్వహణ

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో రెండు రోజుల ఆనందమేళా–2025ని రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ సామంత ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీపీసీ సంస్థ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల పండుగలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల మానసికోల్లాసానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. మెరిట్ విద్యార్థులు మేడిపల్లి దీప, రెబెకలకు రూ.90 వేల చొప్పున ఉత్కర్ష్ స్కాలర్‌షిప్ చెక్కులను, ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సీఎస్సార్–సీడీ నిధులతో సైకిళ్లు అందించారు. ఆదిలాబాద్ కళాకారుల గుస్సాడీ నృత్యం, మ్యాజిక్ షో అలరించాయి. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, ఉపాధ్యక్షురాలు జ్యోత్స్న త్రిపాఠి, ఎన్టీపీసీ ఎన్‌టీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, ఆరెపల్లి రాజేశ్వర్, అధికారులు, సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు ఉన్నారు.

మహిళాభ్యున్నతికి పెద్దపీట



ఎన్టీపీసీ మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. సంస్థలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఒక కుటుంబంలా ఉంటారు. అన్ని పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం.

– రాఖీ సామంత, అధ్యక్షురాలు, దీప్తి మహిళా సమితి, ఎన్టీపీసీ రామగుండం

ఎన్టీపీసీ.. మినీ భారత్



ఎన్టీపీసీ సంస్థ మినీ భారత్‌ను తలపిస్తుంది. ఏటా ఉద్యోగుల కుటుంబాల మానసికోల్లాసం కోసం ఆనందమేళా నిర్వహిస్తున్నాం. వేడుకల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– జ్యోత్స్న త్రిపాఠి, ఉపాధ్యక్షురాలు, దీప్తి మహిళా సమితి, ఎన్టీపీసీ రామగుండం

అన్ని ఏర్పాట్లు చేశాం



ఆనందమేళాలో ఆహ్లాదం కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. చిన్న పిల్లలతోపాటు పెద్దలు సరదాగా గడిపేందుకు స్టాల్స్, పలు ఫోటో గ్యాలరీలు సిద్ధంగా ఉన్నాయి.

– రూపాసింగరాయ్, వెస్ట్ బెంగాల్, సంగీతాదాస్, ఒడిశా

అన్ని రాష్ట్రాల ఉద్యోగులు



ఎన్టీపీసీలో అన్ని రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. అన్ని రకాల భాషలు మాట్లాడతారు కాబట్టి, అన్ని రాష్ట్రాలకు వెళ్లినట్లు అనిపిస్తుంది.

– పద్మ, లావణ్య, రజిత, తెలంగాణ

రాజస్థాన్ సంస్కృతిపై స్టాల్



మా రాజస్థాన్ సంస్కృతి, వస్త్రధారణ అందరికీ తెలిసేలా ఆనందమేళాలో ఒక స్టాల్ ఏర్పాటు చేశాం. ఎన్టీపీసీ సంస్థ మహిళలకు అన్ని రకాల వసతులు కల్పిస్తోంది.

– అనితా జ్యోతి, శ్రీసోని, బిందు, రాజస్థాన్

ఉద్యోగుల కుటుంబాలకు కన్నతల్లి



ఉద్యోగులు నిత్యం విద్యుదుత్పత్తిలో నిమగ్నమవుతారు. వారితోపాటు వారి కుటుంబసభ్యుల కోసం ఆనందమేళా ఏర్పాటు చేయడం అభినందనీయం. ఉద్యోగుల కుటుంబాలను ఎన్టీపీసీ కన్నతల్లిలా ఆదరిస్తుంది.

– మోనిక, మనోజ్ఞ, ఆంధ్రప్రదేశ్



రాజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ: ఎములాడ రాజన్న దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 60 వేల మంది తరలివచ్చారు. మహాశివరాత్రి జాతర మహోత్సవాలు సమీపిస్తుండటంతోపాటు సెలవులు కలిసి రావడంతో కుటుంబసభ్యులతో కలిసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



56 ఏళ్లకు ఒక్కచోటకు

సిరిసిల్ల కల్చరల్: పదోతరగతి చదివి.. ఏకంగా 56 ఏళ్లు గడిచాయి.. తమ చిన్ననాటి మిత్రులను కలుసుకోవాలని ఆరాటపడ్డారు. చివరకు ఆదివారం ఒక్కచోట చేరి, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ వేడుకకు సిరిసిల్ల పట్టణంలోని ఓ బంకెట్ హాల్ వేదికైంది. సిరిసిల్ల జెడ్పీ హైస్కూల్ 1969–70 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 65 మంది 5 దశాబ్దాల తర్వాత తమ బాల్య మిత్రులను కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మడుపు ముత్యంరెడ్డి, ఎస్‌సీసీ నారాయణ, తూడి వెంకట్రావు, కాచం వెంకటేశంలను సత్కరించారు. అందరూ కలిసి భోజనం చేసి, ఫొటోలు దిగారు. రోజంతా సందడి సందడిగా గడిపారు.